క్లుప్తంగా

ఫ్యాప్టో డిప్యూటీ సెక్రటరీ జనరల్‌గా 'దాసరి'


దాసరి నాగేశ్వరరావు

ఆనందపురం : ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) విశాఖపట్నం జిల్లా డిప్యూటీ సెక్రటరీ జనరల్‌గా దాసరి నాగేశ్వరరావు ఎన్నికయ్యారు. ఆయన ఆనందపురం మండలం బోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తానన్నారు. వారి అపరిష్కృత సమస్యల పరిష్కారానికి ఐక్య పోరాటాలే శరణ్యమన్నారు. ఆయన ఎన్నిక పట్ల యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి తాడాన అప్పారావు, జిల్లా కోశాధికారి టీఆర్ అంబేద్కర్, జిల్లా నాయకులు వై.భాస్కర్, ఆనందపురం మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బీఎస్‌వీ కిరణ్‌కుమార్, కేవీ రామసత్యనారాయణ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

పరిసరాల పరిశుభ్రత తప్పనిసరి


స్థానికులతో మాట్లాడుతున్న జెడ్సీ బొడ్డేపల్లి రాము

కొమ్మాది: ప్రతి ఒక్కరు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అప్పుడే వ్యాధులు దరి చేరవని జోన్–1 కమిషనర్ బొడ్డేపల్లి రాము అన్నారు. జీవీఎంసీ 4వ వార్డు కె.నగరపాలెం, కాపులదిబ్బడపాలెంలో స్థానిక కార్పొరేటర్ దౌలపల్లి కొండబాబుతో కలిసి శుక్రవారం ఆయన పర్యటించారు. డ్రైనేజీలు, రోడ్లు ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలని శానిటరీ వర్కర్లకు సూచించారు. నివాసాల మధ్య చెత్త వేయకుండా చెత్త సేకరణ వాహనం వచ్చినప్పుడు తడిచెత్త, పొడిచెత్త వేరు చేసి అందించాలని స్థానికులకు సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు వాసుపల్లి నల్లబాబు, మేరుగు చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు ఖాతాలో రూ.85 వేలు మాయం


బ్యాంక్ మేనేజర్‌కు ఫిర్యాదు చేస్తున్న పాపయ్య

పద్మనాభం: మండలంలోని రెడ్డిపల్లి స్టేట్ బ్యాంకులో తన ఖాతా నుంచి డబ్బులు మాయం కావడంపై రేవిడి పంచాయతీ రౌతులపాలెం గ్రామానికి చెందిన పాండ్రంగి పాపయ్య మేనేజర్‌కు ఫిర్యాదు చేశారు. తాను శుక్రవారం నగదు విత్ డ్రా చేయడానికి చూడగా, డిసెంబర్ నెలలో రూ.85 వేలు తన ప్రమేయం లేకుండా డ్రా చేసినట్లు ఉందని తెలిపారు. దీనిపై విచారణ చేసి, న్యాయం చేయాలని కోరారు.

6వ వార్డులో ఫాగింగ్


రేవళ్లపాలెంలో ఫాగింగ్ చేస్తున్న సిబ్బంది

మధురవాడ: ఇక్కడి 6వ వార్డు పరిధిలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం సాయంత్రం దోమల మందు ఫాగింగ్ జరిగింది. ఈ చుట్టుపక్కల దోమల బెడద ఎక్కువగా ఉండడంతో ఈమేరకు ఫాగింగ్ నిర్వహించారు. అలాగే ఇళ్లల్లో నీరు నిల్వ ఉండకూడదని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అధికారులు ప్రజలకు సూచించారు.

ఏడాది పెన్షన్.. రెండెకరాల ఆదాయంతో సమానం

- ప్రతిపక్షాల దుష్ప్రచారాన్ని లబ్ధిదారులు తిప్పికొట్టాలి
- సీఎం జగన్ పెద్ద మనసున్న నాయకుడు
- భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు


సభకు హాజరైన ప్రజలు


పింఛన్ పంపిణీ చేస్తున్న భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు


చిప్పాడలో పెన్షన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

తగరపువలస: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రస్తుతం ఒక్కో లబ్ధిదారునికి ఏడాదికి అందిస్తున్న పెన్షన్ రెండెకరాల సాగు ద్వారా వచ్చే ఆదాయంతో సమానమని భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. భీమిలి మండలంలో కొత్తగా మంజూరైన పెన్షన్లను శుక్రవారం సాయంత్రం చిప్పాడ గ్రామ సచివాలయం ఆవరణలో లబ్ధిదారులకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాల అమలుపై ప్రతిపక్షాలు చేస్తున్న దుష్ప్రచారాన్ని నాయకులు, కార్యకర్తలతో పాటు లబ్ధిదారులు తిప్పికొట్టాలన్నారు. మండలంలో కొత్తగా 180 పెన్షన్లు వస్తే ఆరుగురు అనర్హులుగా తేలారన్నారు. వీరికి కూడా రీసర్వే ద్వారా అర్హత ఉంటే పెన్షన్లు ఇస్తామన్నారు. చిప్పాడ పంచాయితీలో పార్టీ, కులం చూడకుండా 326 మందికి ఇళ్లు ఇచ్చామన్నారు. అభివృద్ధి, సంక్షేమ పథకాల్లో భాగంగా ఇప్పటి వరకు రూ.18.50 కోట్లు ఈ పంచాయితీలో ఖర్చు చేశామన్నారు. జిరాయితీ భూములు 170 ఎకరాలు 22ఎలో చూపిస్తే ఆ రైతులకు న్యాయం చేశామన్నారు. దివీస్ లేబొరేటరీ గత ప్రభుత్వాల హయాంలో స్థానికులకు ఉద్యోగాలు కల్పించలేదన్నారు. తాను ఎమ్మెల్యే అయిన తరువాతే ఏడాదికి 50 వరకు ఉద్యోగాలు కల్పించామన్నారు. టి.నగరపాలెం గోస్తనీ నదిపై రూ.3 కోట్ల దివీస్ సీఎస్‌ఆర్ నిధులతో వంతెన నిర్మించనున్నామన్నారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే ఎన్నికలు ఎప్పుడు జరిగినా ఫ్యాన్ గుర్తుకే ఓటెయ్యాలన్నారు. సీఎం జగన్ పెద్ద మనసున్న నాయకుడు కాబట్టే అన్నివర్గాల ప్రజలకు న్యాయం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వెంపాడ రమావతి, వ్యవసాయశాఖ జిల్లా సలహా మండలి చైర్మన్ దాట్ల పెదబాబు, భీమిలి ఏఎంసీ చైర్మన్ యలమంచిలి సూర్యనారాయణ, తహసీల్దార్ కోరాడ వేణుగోపాల్, జెడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు, వైస్ ఎంపీపీ బోని బంగారునాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు గాడు శ్రీను, సరగడ రఘునాథరెడ్డి, వెంపాడ సూరిబాబు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు జీవీ నారాయణ, కాద సూర్యనారాయణ, సమ్మిడి శ్రీను, తుపాకుల పైడిరాజు, మద్దిల వెంకటరమణ, చిల్ల హరి, తుపాకుల అప్పలరాజు, బొడ్డు దుర్గారావు, కొల్లి కోటిరెడ్డి, శిరుగుడి ఈశ్వరరావు, బీఎస్ఎన్ రాజు, అక్కరమాని అప్పలనాయుడు, తోట ఎల్లారావు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న పాలనలో ప్రతినెలా పండగే

పీఎంపాలెం: సంక్రాంతి పండగ ఆనందం వారం రోజుల ముందే పీఎంపాలెం ప్రజల్లో కనిపించింది. స్థానిక అవంతి ఫంక్షన్ హాల్లో 726 మంది కొత్త పింఛన్ లబ్ధిదారులతో కలిపి 12,398 మందికి రూ. 3,38,76,250 ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ వెనుకబడిన ప్రజలను ఆర్థికంగా ఆదుకోడానికి సంక్షమ పథకాలు ప్రవేశపెట్టి నిజాయితీగా అమలుపరిచిన గొప్ప పాలకునిగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చరిత్రలో నిలిచిపోతారన్నారు. కావలిసింది పెద్ద వయసు కాదని.. సేవ చేసే పెద్ద మనసు అని పరోక్షంగా టీడీపీ నేతను విమర్శించారు. జగన్ మరలా సీఎం కావాలంటే ఫ్యాను గుర్తుకు ఓటు వేసి భీమిలి ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని ఆయన కోరారు. ఆమాట అనగానే జై జగన్ అన్న నినాదాలతో అక్కడున్న వారు సభను హోరెత్తించారు. ఈ కార్యక్రమంలో మధురవాడ జోన్–2 జెడ్సీ కనకమహాలక్ష్మి, 8వ వార్డు కార్పొరేటర్ లొడగల అప్పారావు, 5, 6, 7 వార్డుల వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు పోతిన మనుమంతరావు, బొట్ట అప్పారావు, పోతిన శ్రీనివాసరావు, మహిళా అధ్యక్షురాలు కె.వరలక్ష్మి, పిల్లా సత్యనారాయణ, సూరిబాబు, కృష్ణమూర్తిపాత్రుడు, పోతిన ప్రసాద్, జామి శివ తదితరులు పాల్గొనారు.

రహదారిపై డెబ్రిస్‌తో రాకపోకలకు ఇక్కట్లు


హైవేని ఆనుకుని ఉన్న ఎం-2 కాలనీ రోడ్డుకు అడ్డంగా వేసిన డెబ్రిస్

మధురవాడ: మధురవాడ జోనల్ కార్యాలయానికి చేరువలో ఉన్న జేఎన్ఎన్‌యూఆర్‌ఎం మధురవాడ-2 కాలనీకి వెళ్లే రోడ్డులో కొందరు డెబ్రిస్ వేశారు. కాలనీ ఏర్పడిన దగ్గర నుంచి గెడ్డని ఆనుకుని ఉన్న ఈ మార్గాన్నే కాలనీ వాసులు రాకపోకలకు వినియోగిస్తున్నారు. అయితే కొద్ది రోజుల క్రితం ఇక్కడ డెబ్రిస్ వేయడంతో రాక పోకలకు తీవ్ర ఇబ్బంది ఏర్పడింది. తప్పనిసరి పరిస్థితుల్లో చాలా మంది దీనిపై నుంచే నడుస్తున్నారు. హైవేని ఆనుకునే కాలనీ ఉన్నా రాకపోకలకు వీలు కాక అర కిలో మీటర్ పైన తిరిగి రోడ్డుకు వస్తున్నారు. ఈ పక్కనే ప్రభుత్వ భూమిని కాజేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్న తరుణంలో వారే ఇలా చేసి ఉంటారని స్థానికులు భావిస్తున్నారు. అయితే వారిపై ఫిర్యాదు చేయడానికి మాత్రం ఎవరూ సాహిసించడంలేదు. అధికారులు స్పందించి దీనిపై నిజా నిజాలు నిగ్గుతేల్చి చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

భారతీయ సంప్రదాయాలంటే ఇష్టం

- బాలభాను పాఠశాల సందర్శనలో విదేశీయులు


బాలభాను పాఠశాలలో విదేశీయుల సందడి

మురళీనగర్: భారతీయ సంస్కృతీ సంప్రదాయాలంటే తమకెంతో ఇష్టమని విదేశీయులు అన్నారు. గురుపూజోత్సవాల సందర్భంగా శుక్రవారం మురళీనగర్ బాలభాను పాఠశాలలో ఈస్ట్ వెస్ట్ బ్రదర్ హుడ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జర్మనీ, ఆస్ట్రేలియా, స్పెయిన్, జర్మనీ, అర్జెంటీనా దేశాలకు చెందిన 40 మంది విశాఖ పర్యటనలో భాగంగా ఈ స్కూల్‌ను సందర్శించారు. ఇక్కడ అమలు చేస్తున్న విద్యా బోధనా విధానం, విద్యార్థుల క్రమశిక్షణ, వారు అనుసరిస్తున్న సంప్రదాయ పద్ధతులు, ఆచార వ్యవహారాలను వీరు దగ్గరుండి పరిశీలించారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు ఆచరణీయమైనవన్నారు. విదేశీ వనితలు తెలుగు సంప్రదాయ దుస్తులు, చీరలు ధరించి సందడి చేశారు. ఆస్ట్రేలియా నుంచి రోసీ డియాజ్ డ్యూక్ గ్రూప్, జర్మనీ నుంచి రాబర్ట్ బడియా గ్రూప్, స్పెయిన్ నుంచి లూడ్జర్ ఫిలిప్స్ గ్రూప్ సభ్యులు, అర్జెంటీనా కంట్రీ గ్రూప్ నుంచి ఆల్‌బెర్ట్ బెలిజి, క్రిస్టియానా యూఎస్‌ఏ గ్రూప్ నుంచి మిక్వెల్, రోజా సగ్రోసా తదితరులు పాఠశాలను సందర్శించారు. కార్యక్రమంలో జగద్గురు పీఠం కార్యదర్శి, బాలభాను విద్యాలయం కరస్పాండెంట్ రామకృష్ణరాజు, ప్రిన్సిపాల్ శుభశ్రీ, వైస్ ప్రిన్సిపాల్ టి.మనోరమణి, వ్యాయామ ఉపాధ్యాయుడు సిహెచ్.రమణరావు పాల్గొన్నారు.

విద్యార్థులకు రాతసామగ్రి పంపిణీ


విద్యార్థులకు పెన్నులు అందజేస్తున్న చంద్రమౌళి

ఆనందపురం : గొట్టిపల్లి పంచాయతీ వెంకటాపురం ప్రాథమికోన్నత పాఠశాలకు చెందిన 110 మంది విద్యార్థులకు ఆనందపురం ఆంధ్రాబ్యాంక్ పూర్వ మేనేజర్ వి.చంద్రమౌళి పెన్నులు, పెన్సిళ్లు, బిస్కట్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఉద్యోగ రీత్యా ఆనందపురం మండలంతో అనుబంధం ఉండడంతో కుటుంబ సభ్యుల జన్మదినోత్సవాన్ని విద్యార్థుల మధ్య జరుపుకోవడం ఆనందాన్నిస్తుందన్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి పేద విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగులు పంపిణీ చేయడంతో పాటు ఉత్తమ ఫలితాలు సాధించిన వారికి ప్రోత్సాహకాలు అందించడానికి నిర్ణయించామన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వెంకటరావు, ఉపాధ్యాయులు వర్మ, అపరంజి, భారతి, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

9న నివాస హక్కుల పోరాటంపై సదస్సు



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న లక్ష్మి తదితరులు

సీతమ్మధార : ఈనెల 9న నివాస హక్కుల పోరాట దినంపై డాబాగార్డెన్స్‌లోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో సదస్సు నిర్వహిస్తున్నట్లు మురికివాడ నివాసుల సంక్షేమ సంఘం, ప్రగతిశీల మహిళా సంఘం నాయకులు తెలిపారు. ఈ మేరకు జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పీవోడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.లక్ష్మి మాట్లాడుతూ ఈ సదస్సులో కేంద్ర ఇంధన శాఖ పూర్వ కార్యదర్శి ఈఏఎస్ శర్మ ప్రారంభోపన్యాసం చేయనున్నారని తెలిపారు. రైతాంగ ఉద్యమంలో కీలక బాధ్యతలు నిర్వహించిన డాక్టర్ ఆశిష్‌మిట్టల్ ముఖ్య అతిథిగా ప్రసంగిస్తారని అన్నారు. యూసీడీ డిపార్ట్‌మెంట్ కేటాయించిన 40 శాతం నిధులను మురికివాడల అభివృద్ధి, ఉపాధికి కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కన్వీనర్ ఈసర లక్ష్మి, కో–కన్వీనర్ పరదేశి, అప్పారావు, పీవోడబ్ల్యూ జిల్లా అధ్యక్షులు ఎస్.వెంకటలక్ష్మి, బాలనాగమ్మ, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి కె.నిర్మల, దళిత విముక్తి కన్వీనర్ ఎస్వీ రమణ, తదితరులు పాల్గొన్నారు.

కళాభారతి ట్రస్ట్ కార్యదర్శి గుమ్ములూరికి డాక్టరేట్

మద్దిలపాలెం: సింహాచలం దేవస్థానం, దేవాలయ పరిపాలన తదితర అంశాలపై 74 ఏళ్ల వయస్సులో చేసిన పరిశోధనకు కళాభారతి ట్రస్ట్ కార్యదర్శి గుమ్ములూరి రాంబాబు ఆంధ్రా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పొందారు. ఈ మేరకు ఏయూ వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాదరెడ్డి నుంచి డాక్టరేట్ ఉత్తర్వులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు అభినందించారు.

ద్విచక్రవాహనం ఢీకొని ఒకరికి తీవ్రగాయాలు

తగరపువలస: భీమిలి మండలం చిప్పాడ దివీస్ లేబరేటరీ హాస్టల్ గేటు వద్ద గత డిసెంబరు 31న జరిగిన రోడ్డు ప్రమాదంలో విజయనగరం జిల్లా గంట్యాడ మండలం వసంత గ్రామానికి చెందిన బర్ల రవి అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడు తన ద్విచక్రవాహనంపై హాస్టల్ నుంచి బయటికి వస్తుండగా గేటుకు వంద మీటర్ల దూరంలో మరో ద్విచక్రవాహనంపై వేగంగా, నిర్లక్ష్యంగా వచ్చిన వ్యక్తి ఢీకొనడంతో రవి కుడి కాలు విరిగిపోయింది. వెంటనే సంగివలస ఎన్ఆర్ఐ ఆసుపత్రికి.. తరువాత మెరుగైన చికిత్స కోసం నగరంలో కార్పొరేట్ ఆసుపత్రికి తరలించారు. క్షతగాత్రుడు రవి తండ్రి అప్పారావు శుక్రవారం భీమిలి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో హెడ్ కానిస్టేబుల్ వెంకటరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బ్రెయిలీకి ఘన నివాళి


బ్రెయిలీ విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న సుబ్బారెడ్డి

కొమ్మాది: అంధుల కోసం ప్రత్యేక లిపిని రూపొందించిన బ్రెయిలీని ప్రతీ ఒక్కరూ ఆదర్శంగా తీసుకుని ఎదగాలని విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకుడు సుబ్బారెడ్డి అన్నారు. లూయీస్ బ్రెయిలీ వర్ధంతి సందర్భంగా సాగర్‌నగర్ ప్రభుత్వ అంధ బాలికల ఆశ్రమ పాఠశాలలోని బ్రెయిలీ విగ్రహానికి శుక్రవారం ఆయన నివాళులర్పించారు. మూడు రోజులుగా బ్రెయిలీ జీవితంపై నిర్వహిస్తున్న వ్యాస రచన, వ్యక్తృత్వ పోటీల్లో విజేతలకు ఆయన బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మహేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి బాసట


బాధిత కుటుంబానికి బియ్యం, సరకులు అందిస్తున్న లీలావతి

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ రెండోవార్డు కొత్తపేటకు చెందిన భవిరిశెట్టి రాంబాబు ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి, మృతి చెందాడు. ఈ మేరకు స్థానిక గాయిత్రీ జెరాక్స్ యజమానురాలు దేశెట్టి లీలావతి బియ్యం, నిత్యావసర సరుకులు అందించారు. వీటిని మాజీ కౌన్సిలర్ పిట్టా సురేష్ చేతుల మీదుగా మృతుని భార్య గౌరికి అందించారు. గుండె సంబంధిత వ్యాధితో బాధ పడుతున్న గౌరి చిన్నకుమార్తె వైద్యానికి సాయం అందిస్తానని ఆమె భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో పిల్లా రాజేష్, పల్లా అప్పలకొండ, మాదాబత్తుల వెంకట అప్పారావు, రజక సంఘ నాయకులు భవిరిశెట్టి అప్పలకొండ, వేములయ్య పాల్గొన్నారు.

'సర్వీస్ రోడ్డుపై మురుగు నీరు తొలగించాలి'

తగరపువలస: సంగివలస సర్వీస్ రోడ్డుపై రోజుల తరబడి మురుగునీరు నిలిచిపోవడంతో స్థానికుల సాయంతో టీడీపీ నాయకులు శుక్రవారం ఆందోళన చేపట్టారు. ఆ పార్టీ విశాఖ పార్లమెంట్ కార్యదర్శి పిట్టా సురేష్ ఆధ్వర్యంలో సబ్బివానిపేట, అల్లూరి సీతారామరాజు కాలనీ వాసులు ఈ నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. సంగివలస చెరువు నుంచి నీరు బయటకు వెళ్లకుండా, డ్రైనేజీలలో మురుగునీరు చెరువులోకి వెళ్లకుండా రోజుల తరబడి ఉండిపోతున్నా జీవీఎంసీ, ఇరిగేషన్ అధికారులు స్పందించడం లేదన్నారు. వెంటనే సర్వీస్ రోడ్డులో మురుగునీరు మళ్లించే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

శ్రీవారికి పట్టు వస్త్రాల సమర్పణ


పట్టువస్త్రాలు తీసుకొస్తున్న సూర్యనారాయణరాజు

కొమ్మాది(భీమిలి): రుషికొండలోని శ్రీమహాలక్ష్మి గోదాదేవి సహిత వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం శ్రీవారాభిషేకం వైభవంగా నిర్వహించారు. ముందుగా శ్రీవారిని ప్రత్యేకంగా అలంకరించేందుకు మంగళవాయిద్యాల నడుమ టీటీడీ అర్చకులు, ఇన్‌స్పెక్టర్ సూర్యనారాయణరాజు పట్టు వస్త్రాలను తీసుకువచ్చి సమర్పించారు. అనంతరం అభిషేకం, పుష్ప నివేదన చేసి, శ్రీవారికి ప్రత్యేక పూజలు చేశారు.

మలేరియా కమిటీ సమావేశం నేడు

డాబాగార్డెన్స్: నగరంలో దోమల నియంత్రణకు చేపట్టే చర్యల్లో భాగంగా గత కౌన్సిల్ సమావేశంలో మేయర్ గొలగాని హరివెంకటకుమారి ఓ కమిటీ వేశారు. కమిటీ తొలి సమావేశం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో శనివారం నిర్వహించనున్నారు.

పేదల సంక్షేమమే లక్ష్యంగా పాలన


దివ్యాంగుడికి సంక్షేమ పథకాల కరపత్రాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి

భీమునిపట్నం: పేదలకు అన్ని విధాలా మేలు చేయడమే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. ఎక్కడా అవినీతి అన్నది లేకుండా సుపరిపాలన అందిస్తున్నారన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా కృష్ణాకాలనీలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఎన్నో రకాలుగా అవినీతి జరిగి, కోట్లాది రూపాయల ప్రజా ధనం దోపిడీకి గురైందన్నారు. కాని సీఎం జగన్ అధికారాన్ని చేపట్టిన తరువాత ఎంతో పారదర్శకంగా పాలనను అందిస్తున్నారని, ఇంత వరకు ఎక్కడా చిన్న తప్పు కూడా జరగలేదన్నారు. వలంటీర్, సచివాలయ వ్యవస్థల వల్ల అర్హులందరికీ లబ్ధి చేకూరుతోందన్నారు. మన రాష్ట్రంలో అమలవుతున్న అనేక పథకాలు జాతీయ స్థాయిలో ప్రశంసలు పొందడంతో పాటు, ఇతర రాష్ట్రాలు కూడా పాటించే స్థితిలో ఉన్నాయన్నారు. స్వయం ఉపాధి పొందడానికి చిరు వ్యాపారులకు ఆర్థిక సాయం అందివ్వడంతో పాటు ఎన్నో కుటుంబాలకు చాలా మేలు జరుగుతోందని, ఇవన్నీ చాలా గొప్ప విషయాలని అన్నారు. ఇలా ఊహించలేని విధంగా జరుగుతున్న మేలు చూసి ప్రతిపక్షాలకు ఏం చేయాలో దిక్కు తోచని పరిస్థితి ఏర్పడిందని, అందుకే సీఎం జగన్‌పై ఆరోపణలు చేస్తున్నాయని అన్నారు. ఎవరు ఎన్ని ప్రయత్నాలు చేసినా, సీఎం జగన్‌కు జనాదరణ రోజురోజుకూ పెరుగుతూనే ఉందన్నారు. అనంతరం స్థానికులు మంచినీరు, కాలువల సమస్యల గురించి తెలపగా, వాటిని వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ బి.రాము, మూడో వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు అల్లిపిల్లి నర్సింగరావు, నాయకులు వాసుపల్లి కొండబాబు, ఎస్.కరుణాకరరెడ్డి, జి.మధునాయుడు, ఆర్.ప్రభాకర్ నాయుడు, కోండ్రు రామసూరప్పడు, భాగం స్వాతి సుధాకర్, అనపర్తి సూర్యప్రకాశ్, పిన్నింటి ఎర్రయ్యరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తెగిన విద్యుత్ వైరుతో భయం భయం


సుఖీభవ కాలనీ రోడ్డులో ట్రాక్టర్‌పై తెగిపడిన విద్యుత్ వైరు

తగరపువలస: సంగివలస సుఖీభవ కాలనీ రహదారిలో శుక్రవారం మధ్యాహ్నం విద్యుత్ వైరు తెగిపడింది. రోడ్డుపక్కనే నిలిపి ఉంచిన పాత ట్రాక్టర్ మీదుగా డివైడర్ దాటి రహదారి అవతలి వరకు ఈ తెగిపడిన వైరు ఉంది. ఆ సమయంలో ఈ రహదారిపై రాకపోకలు లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది. విద్యుత్ వైరు వరకు ఆవు రావడంతో స్థానికులు దానిని అక్కడి నుంచి తోలేశారు. తరువాత చిట్టివలస విద్యుత్‌శాఖ సిబ్బందికి సమాచారం అందించి ఊపిరి పీల్చుకున్నారు.

హోరాహోరీగా పోటీలు


డిస్కస్‌త్రో చేస్తున్న కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ విద్యార్థిని


చదరంగం ఆటలో నిమగ్నమైన విద్యార్థినులు

మురళీనగర్: కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో నిర్వహిస్తున్న ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ గేమ్స్ పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. శుక్రవారం వెలువడిన ఫలితాల ప్రకారం బాల్‌బ్యాడ్మింటన్ విజేతగా సాయిగణపతి పాలిటెక్నిక్ కాలేజీ, షటిల్ బ్యాడ్మింటన్ డబుల్స్‌లో ఏవీఎన్ పాలిటెక్నిక్ కాలేజీ, టేబుల్ టెన్నిస్ సింగిల్స్‌లో ఏవీన్ కాలేజీ, టేబుల్ టెన్నిస్ డబుల్స్‌లో సాయిగణపతి పాలిటెక్నిక్ కాలేజీ, చెస్ పోటీల్లో కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీ(గైస్), 100 మీటర్స్ అథ్లెటిక్స్‌లో ఏవీఎన్ కాలేజీ, 400 మీటర్ల పరుగు పందెంలో ఏవీన్ కాలేజీ, 800 మీటర్ల ఈవెంట్‌లో పాడేరు జీఎంఆర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ, 1500 మీటర్ల ట్రాక్‌లో కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ, బ్రాడ్ జంప్‌లో ఏవీఎన్ పాలిటెక్నిక్ కాలేజీ, షాట్‌పుట్‌లో విశాఖపట్నం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలు విజేతలుగా నిలిచాయి.

విద్యార్థినుల సత్తా

బాలికల పోటీలకు సంబంధించి 100 మీటర్ల పరుగు పందెం, ఖోఖో, వాలీబాల్ పోటీల్లో భీమునిపట్నం ప్రభుత్వ బాలికల పాలిటెక్నిక్ కాలేజీ, షటిల్ బ్యాడ్మింటన్ సింగిల్స్, డబుల్స్ పోటీల్లో కశింకోటలోని రాజీవ్‌గాంధీ ఆర్‌ఈసీఎస్ పాలిటెక్నిక్ కాలేజీ, టేబుల్ టెన్నిస్ సింగిల్స్, డబుల్స్‌లో సాయిగణపతి కాలేజీ, చెస్, 800 మీటర్ల పరుగు, డిస్కస్‌త్రోలో విశాఖపట్నం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ, షాట్‌పుట్‌లో ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీ, బ్రాడ్ జంప్‌లో సాయిగణపతి కాలేజీల బాలికలు విజేతలుగా నిలిచారు.

నేటి నుంచి చేనేత వస్త్రాల ప్రదర్శన

బీచ్ రోడ్డు: చేనేత కార్మికులకు జీవనోపాధి కార్యక్రమంలో భాగంగా ఆంధ్రప్రదేశ్, అసోం, నాగాలాండ్, ఒడిశాకు చెందిన చేనేత వస్త్రాల ప్రదర్శనను శని, ఆదివారాల్లో పామ్‌బీచ్ హోటల్‌లో నిర్వహించనున్నట్లు టాటా ట్రస్ట్ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. అంతరన్ పేరుతో ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు ఈ ప్రదర్శన అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. తమ సంస్థ ద్వారా చేనేత కార్మికుల ఉపాధి కోసం కృషి చేస్తున్నట్లు తెలిపారు.